సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం : 18 అక్టోబర్ 2024



క్రీడా సందడి
జూనియర్ కళాశాలల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల సందడి నెలకొంది.
వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో
జూరాలకు వస్తున్న వరద 51 వేల క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు తెలిపారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.6 /22.0
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు మోస్తరు వర్షం . చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్ల విస్తరణకు రూ.204 కోట్లు మంజూరు



కల్వకుర్తి టౌన్: నియోజకవర్గంలో పలు రోడ్ల విస్తరణకు సంబంధించి రూ.204 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలైలో కల్వకుర్తిలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి పలు రోడ్ల విస్తరణతోపాటు పలు హామీలు ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఆయా పనులను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో ఇటీవలే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూ.43.32 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ ద్వారా రూ.15 కోట్లు, ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.189 కోట్లు రోడ్ల విస్తరణకు మంజూరయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను నట్టేట ముంచిందని, ఇదే ప్రభుత్వంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీను, ఎజాస్, నాయకులు ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంతుయాదవ్, చిన్న రాంరెడ్డి, షానవాజ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలి



డిపో మేనేజర్ యాదయ్య

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని డిపో మేనేజర్ యాదయ్య అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా పండగ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఈ నెల 20 వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం తమ సలహాలు, సూచనలు అందించాలని చెప్పారు. దసరా పండుగ సందర్భంగా నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు 12 ప్రత్యేక బస్సులు, మహబూబ్‌నగర్, కొల్లాపూర్, వనపర్తికి 6 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు.

కుండపోత వర్షం



నాగర్‌కర్నూల్ రూరల్: మండల వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దాదాపు అరగంటకుపైగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. భారీ వర్షం కురవడంతో చేతికొచ్చే దశలో ఉన్న పత్తి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.

జీల్దార్‌తిప్పలు తీరేనా?

కేఎల్‌ఐ రిజర్వాయర్ నుంచి చెరువు వరకు కెనాల్ తవ్వేందుకు శంకుస్థాపన



జీల్దార్‌తిప్ప చెరువు

- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు
- మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాలకు అందని సాగునీరు
- తాజాగా 'పాలమూరు' నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రతిపాదనలు
- పనులు పూర్తయితే 3 వేల ఎకరాల ఆయకట్టు, వన్యప్రాణులకు మేలు

కొల్లాపూర్: నల్లమల అటవీ ప్రాంతంలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాలకు సమీపంలోనే కేఎల్‌ఐ ప్రాజెక్టు ఉంది. ఇక్కడే పాలమూరు ప్రాజెక్టు సైతం నిర్మిస్తున్నారు. రెండు అతిపెద్ద ప్రాజెక్టులు పక్కనే ఉన్నా ఆ గ్రామాలకు మాత్రం సాగునీరు అందడం లేదు. ప్రాజెక్టులకు ఎగువ భాగంలో ఈ గ్రామాలు ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఆయా గ్రామాల రైతులు పంటలు సాగు చేసేందుకు నేటికీ వర్షాలపైనే ఆధారపడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని పాలకులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోకపోవడంతో రైతాంగం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. దీనిపై ఇటీవల నీటిపారుదల శాఖ అధికారులతో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. దీంతో ఈసారైనా సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశలో రైతులు ఉన్నారు.

ఆ చెరువే ఆధారం..

కృష్ణానది సమీపంలోనే ఉన్న మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లో పంటల సాగుకు జీల్దార్‌తిప్ప చెరువే ప్రధాన నీటి వనరు. ఈ చెరువును 1970లో అప్పటి ఎమ్మెల్యే కె.రంగదాసు నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం 2 టీఎంసీలు. ఈ చెరువును ముఖ్యమంత్రి హోదాలో జలగం వెంగళరావు ప్రారంభించారు. ఈ చెరువు కింద 1,300 ఎకరాల ఆయకట్టుకు ఉంది. మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువుల కింద మరో 500 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో పంటల సాగు సాఫీగా జరుగుతున్నప్పటికీ.. రబీ సీజన్‌లో మాత్రం సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

సాగునీటి మళ్లింపు కోసం..

కృష్ణానది నీటిని మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామాల్లోని పంట పొలాలకు అందించాలనే ఉద్దేశంతో 2004లో రూ.3 కోట్లతో కృష్ణా బ్యాక్‌వాటర్‌పై మినీ లిఫ్టు నిర్మించేందుకు శిలాఫలకం వేశారు. కానీ, పనులు చేపట్టలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరోసారి మొలచింతలపల్లి, ముక్కిడిగుండం గ్రామ పొలాలకు సాగునీరు మళ్లించాలనే అంశం తెరపైకి వచ్చింది. ఈ మేరకు 2019లో కేఎల్‌ఐ నుంచి జీల్దార్‌తిప్ప చెరువుకు నీటిని తరలించేందుకు రూ.19 కోట్లు కేటాయించారు. అదే సంవత్సరం మార్చి నెలలో శంకుస్థాపన చేసినా.. భూ సేకరణకు నిధులు సరిపోవనే కారణంతో పనులు ముందుకు సాగలేదు.

వన్యప్రాణులకూ ఉపయోగమే..

జీల్దార్‌తిప్ప చెరువును ఆనుకొని నల్లమల అటవీ ప్రాంతం ఉంటుంది. ఈ చెరువును కేఎల్‌ఐ నీటితో నింపితే చెరువు కింద ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందడంతోపాటు.. నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు కూడా తాగునీటి సౌకర్యం కల్పించినట్లు అవుతుంది. ఇప్పటికే జీల్దార్‌తిప్ప చెరువుకు ప్రతినిత్యం వందలాది వన్యప్రాణులు తాగునీటి కోసం వస్తుంటాయి.

సాగునీటిని మళ్లించాలి



కేఎల్‌ఐ, పాలమూరు ప్రాజెక్టులు మా గ్రామాల సమీపంలోనే ఉన్నా.. కృష్ణానది నీళ్లు అందడం లేదు. మాకు జీల్దార్‌తిప్ప చెరువు నీళ్లే దిక్కు. వర్షాలు బాగా పడితే చెరువు కాల్వల ద్వారా ఒక పంటకు నీళ్లు అందుతాయి. చెరువులో నీళ్లు తగ్గితే రబీ పంట వేసుకునే అవకాశం ఉండదు. కేఎల్‌ఐ ద్వారా కృష్ణా నీటిని జీల్దార్‌తిప్ప చెరువుకు మళ్లించేందుకు గతంలో శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి.. సాగునీటిని అందించాలి.

– మల్లేష్‌యాదవ్, ముక్కిడిగుండం

ప్రతిపాదనలు పంపిస్తాం..



జీల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్‌ఐ ద్వారా సాగు నీటిని తరలించేందుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధుల మంజూరులో జాప్యం జరిగింది. ఇటీవలే మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ అంశంపై చర్చించారు. కేఎల్‌ఐ ద్వారా కాకుండా పాలమూరు ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయానికి వచ్చాం. అయితే కాల్వలు కాకుండా పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించాలని భావిస్తున్నాం. నెల రోజుల్లో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

తాజాగా మంత్రి సమీక్ష..

కొల్లాపూర్ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే జీల్దార్‌తిప్ప చెరువు అంశం కూడా చర్చకు రాగా.. కాల్వల తవ్వకాలకు ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు మంత్రికి వివరించారు. కేఎల్‌ఐ ప్రాజెక్టులోని డీ–5 కాల్వకు అనుసంధానంగా తవ్వాలని గతంలో అధికారులు నిర్ణయించారు. అయితే డీ–5 కాల్వ పాలమూరు ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్‌లో మునిగిపోతోంది. దీంతో ఇప్పుడు నార్లాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానంగానే నీటి తరలింపు చేపట్టాలని అధికారులు వివరించారు. కాల్వలు తవ్వేందుకు అటవీ శాఖ నుంచి అనుమతి కావాలని, కాల్వలకు బదులుగా ప్రెజర్‌మెయిన్స్ ఏర్పాటు చేసి.. పైప్‌లైన్లతో నీటిని జీల్దార్‌తిప్ప చెరువుకు తరలిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి.. ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.

కొత్తగా 87 పోలింగ్ కేంద్రాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: జిల్లాలోని నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 11, అచ్చంపేటలో 61, కొల్లాపూర్ పరిధిలో 15 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఈ నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని, దీనిపై మార్పులు, చేర్పుల కోసం అదేరోజు నుంచి వచ్చేనెల 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన, నవంబర్ ప్రత్యేక ఓటరు నమోదు, డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై గురువారం కలెక్టరేట్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 24న మార్పులు, చేర్పుల దరఖాస్తులను పరిష్కరించి.. జనవరి 6న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఇందుకోసం అన్ని పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్, ఆర్డీఓ, ఓటరు నమోదు అధికారి కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని, అలాగే జ్ఞ//ఠ్త్వౌటట.ౌఛిజీ.జౌఠి.జీ ఽ ఆన్‌లైన్‌లో, ఓటరు హెల్ప్ లైన్ యాప్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబర్ 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు అర్హత ఉన్న వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్నికల సెక్షన్ విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్నికల డీటీ రఘు పాల్గొన్నారు.

- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లాలోని విద్య, వైద్య, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు మౌలిక సదుపాయాల కల్పనకు వివరాలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ శాఖలు తమ నిర్వహణలో ఉన్న హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, టాయిలెట్లు, క్రీడా వసతులు, ప్రహరీ వంటివి గుర్తించాలని సూచించారు. మౌలిక వసతులకు సంబంధించి శుక్రవారంలోగా సమగ్ర నివేదికను అందించాలని చెప్పారు.
- ఖరీఫ్ 2023– 24 సీజన్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ఈ నెల 31లోగా అందించాలని కలెక్టర్ మిల్లర్లను ఆదేశించారు. అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి సివిల్ సప్లయ్ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా సీఎంఆర్ బియ్యం అందించకుంటే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్లక్ష్యం వహించిన వారిని బ్లాక్ లిస్ట్‌లో ఉంచుతామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని కలెక్టర్ చెప్పారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు..

జిల్లాలోని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో డయాగ్నోస్టిక్ సెంటర్లను సందర్శించి నిర్దేశించిన ప్రకారం సేవలు అందిస్తున్నారా.. లేదా తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని వైద్యులందరికీ గర్భస్థ లింగ నిర్ధారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా.. పరీక్షలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్ కెనాల్ కాల్వ పూర్తిచేస్తాం



పోతేపల్లిలో సబ్‌కెనాల్ కాల్వను పరిశీలిస్తున్న డీఈఈ సమ్మయ్య

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామంలో డీ–82 కాల్వలో భాగంగా సబ్ కెనాల్ 99 నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడానికి కృషిచేస్తామని డీఈఈ సమ్మయ్య అన్నారు. గురువారం గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో ఆయన పరిశీలించి అసంపూర్తి కాల్వ పనులను చూసి వివరాలను నమోదు చేసుకున్నారు. గతంలో గ్రామంలోని రైతులకు సాగునీరు అందించడానికి సబ్ కెనాల్ 99 కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని పనులను అసంపూర్తిగా చేశారు. దీంతో కాల్వలో నీరు పుష్కలంగా రావడంతో పనులు పూర్తి కాకపోవడంతో సాగునీరు వ్యవసాయ పొలాలకు వెళ్లడంతో రైతుల పంటలు నష్టపోతున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం దెబ్బతిన్న వేరుశనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కొండల్‌యాదవ్, బాలస్వామి, శ్రీశైలం తదితరులున్నారు.

వాల్మీకి గొప్ప మహర్షి



వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

పెంట్లవెల్లి: వాల్మీకి ఎంతో గొప్ప మహర్షి అని.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని ఆయన నిరూపించారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రామాయణ మహా కావ్యాన్ని రచించి ఎంతో మందికి అర్థమయ్యే విధంగా బోధించిన గొప్ప వ్యక్తి అని, అలాంటి వాల్మీకి జయంతి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మండలంలోని కొండూరులో వాల్మీకి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, కొల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పగిడాల శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, రామన్‌గౌడ్, భానుప్రకాష్, రెడ్డి రవి, రెడ్డి రాము, ధర్మతేజ, విజయరామారావు, వెంకటేశ్వర్లు, భూపతి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ ఆర్టీసీ డిపోకు 2.65 కోట్ల ఆదాయం

కొల్లాపూర్: దసరా సీజన్‌లో కొల్లాపూర్ ఆర్టీసీ డిపోకు 2.65 కోట్ల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ ఉమాశంకర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో కంటే ఈసారి పండుగ సీజన్‌లో అధిక ఆదాయం లభించిందన్నారు. ఈ నెల 1 నుంచి 16 వరకు కొల్లాపూర్ డిపో బస్సుల ద్వారా 5.6 లక్షల మంది ప్రయాణించారన్నారు. కొల్లాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే బస్సుకు మంచి స్పందన వస్తుందన్నారు. శ్రీశైలానికి కూడా ఇకపై ప్రతిరోజు బస్సు నడిపిస్తామన్నారు. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు ప్రతిరోజు తెల్లవారుజామున 3 గంటలకు, 3.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు, 2.30 గంటలకు డీలక్స్ బస్సులు తిప్పుతున్నామని చెప్పారు. రాత్రి 7.30 గంటలకు, 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు డీలక్స్ బస్సు సౌకర్యం ఉందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీని అనుసరించి వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన స్థలం కేటాయిస్తామని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది నజీర్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

పాలియేటివ్ సేవలు వినియోగించుకోండి



జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు, చికిత్స లేని ప్రాణాంతక రోగాలు అనుభవిస్తున్న వారికి జీవన నాణ్యత సంరక్షణ చికిత్స సౌకర్యాలు మెరుగుపరచడానికి దృష్టిసారించే ప్రత్యేక చికిత్స విధానాల కోసం ప్రభుత్వం పాలియేటివ్ కేర్ యూనిట్లను నిర్వహిస్తుందని డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ పాలియేటివ్ కేర్ దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పాలియేటీవ్ కేర్ సెంటర్‌లో 24 గంటల వసతి సౌకర్యం ఉంటుందని, ఇక్కడ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యం అందిస్తూ, ఉపశమనం కలిగిస్తారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తీవ్రమైన అస్వస్థతతో ఏదైనా ప్రాణాంతక వ్యాధులకు గురై అవసాన దశలో బాధ పడుతున్న వారికి అండగా ఉండాల్సిన అవసరం సమాజంపై ఉందని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరి జీవితం అంతటా సమగ్ర సంరక్షణలో భాగంగా పాలియేటివ్ కేర్‌ను బలోపేతం చేయాలని కోరారు. హోం కేర్ వాహనంలో గ్రామాలు, పట్టణాల్లో ఉన్న వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడం, అవసరమైన వారిని జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చి అడ్మిట్ చేయడం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకట్‌దాస్, ప్రోగ్రాం అధికారులు కృష్ణమోహన్, శ్రీనివాసులు, దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఒక సీసీ కెమెరా 100 మందితో సమానం



మాట్లాడుతున్న ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్: సీసీ కెమెరాలు ఏర్పాటుతో ఎంతో ప్రయోజనమని, ఒక్కో సీసీ కెమెరా 1000 మందితో సమానమని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లిలో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను గురువారం ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో కేవలం వెయ్యి జనాభా మాత్రమే ఉన్నప్పటికీ గ్రామస్తులందరూ కలిసికట్టుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో గొడవలు జరుగుతుంటాయని, ఇతర గ్రామాల నుంచి వచ్చి చోరీలు చేసేవారిని సీసీ కెమెరాలు పట్టిస్తాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, అదేవిధంగా పోలీస్ విచారణ కూడా తేలిక అవుతుందన్నారు. పోలీస్ అధికారుల కృషి, గ్రామస్తుల సహకారంతో రోజు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని మండలంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు అప్పాజిపల్లి గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజలకు పోలీసుల సహకారం తప్పక ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్ సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అప్పాద్రి కొండపై వెలసిన స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామిని ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, విండో వైస్ చైర్మన్ రాందేవ్ రెడ్డి, మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను అందరి సహకారంతో వైభవంగా నిర్వహించుకుందామని కలెక్టర్ విజయేందిర పిలుపునిచ్చారు. గురువారం బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు కురుమూర్తి స్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి స్వామివారి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలు నవంబర్ 2 నుంచి ప్రారంభమవుతాయని, ఈనెల 31 నుంచి ప్రత్యేక పూజలుంటాయని తెలిపారు. 2న కల్యాణోత్సవం, 6న అలంకరణం, 8న ఉద్దాలోత్సవం కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో స్వామి వారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకుందామని సూచించారు. లక్షలాది మంది భక్తులు హాజరవుతారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉండేందుకు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసే విధంగా షిఫ్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మంచి నీటి వసతి, రోడ్ల మరమ్మతు చేపట్టాలన్నారు. కోనేరులో నీరు ఎప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలూ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, ఆలయానికి చేరుకునే అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటుతో పాటు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ మధనేశ్వరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

ధరూరు: బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మక్తల్‌కు చెందిన వెంకటేష్, కృష్ణవేణి దంపతులు గత ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం ధరూరుకు వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15న వెంకటేష్(35) బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులతో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో అదేరోజు అతని భార్య కృష్ణవేణి రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం ఉదయం ధరూరు చెరువులో వెంకటేష్ మృతదేహం కనిపించడంతో చుట్టుపక్కల రైతులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీలసులు మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం అనంతరం కటుంబ సభ్యులకు అప్పగించారు. అతనికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో విద్యార్థిని..


అంకిత (ఫైల్)

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అంకిత (15) బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దామరగిద్దకు చెందిన వడ్ల మల్లప్ప కూతురు అంకితకు వారం రోజుల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌తో కోమాలోకి వెళ్లింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి : ఇద్దరి గాయాలు

చిన్నచింతకుంట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ఉంద్యాల సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌స్టేషన్ హౌజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. అడ్డాకుల మండలం వర్నెకు చెందిన కురుమన్న, అంజన్న (49), కురుమన్న ముగ్గురు కలిసి అమరచింత మండలం కొంకన్వానిపల్లిలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి గ్రామానికి వస్తుండగా ఉంద్యాల సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాల పాలయ్యారు. వెంటనే గ్రామస్తులు వారిని కొకుంట్ల మండలం పేరూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అంజన్న మృతిచెందాడు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంజన్నకు భార్య, ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

వ్యక్తి అదృశ్యం

- మూడు రోజులుగా గాలింపు చర్యలు


ఈదయ్య (ఫైల్)

మన్ననూర్: నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతంలో అదృశ్యమైన యువకుడి కోసం మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌కు 5 కిలో మీటర్ల దూరంలో మోటారు బైక్, హెలిమెట్, సెల్‌ఫోన్, రేయిన్ కోటు, వాటర్ బాటిల్ లభించిన విషయం తెలిసిందే. దొరికిన వస్తువుల ఆధారాలను బట్టి ఆ పరిసర అటవీ ప్రాంతంలో అటవీశాఖ సహకారంతో అమ్రాబాద్ పోలీసులు రెండు రోజులు వెతికినా ఫలితం కనిపించలేదు. అదృశ్యమైన మోడం ఈదయ్య నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామం కావడంతో ఆయనకు సంబంధించిన కుటుంబ సభ్యులు అమ్రాబాద్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. 15 రోజుల క్రితం లింగాల మండలం ఎర్రపెంటకు చెందిన గిరిజన యువకుడు శంకర్, ప్రస్తుతం మూడు రోజుల క్రితం నల్లగొండ జిల్లాకు చెందిన యువకుడు ఈదయ్య తప్పిపోవడం అంతుచిక్కని ప్రశ్నగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అమ్రాబాద్ పోలీసులు మిస్సింగ్ కేసుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదృశ్యమైన వారి సమాచారం ఎవరికైనా తెలిస్తే 8712657740కు అమ్రాబాద్ సీఐ, 8712657731 అచ్చంపేట సీఐ, 9441918282 రాందాస్ కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కళాశాలస్థాయిలో క్రీడాసందడి

- ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు
- ఈ నెల 22నుంచి అండర్–19 విభాగం ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు
- ప్రతి జిల్లాలో ఒక జాతీయ, ఏడు రాష్ట్రస్థాయి టోర్నీలు


జిల్లా కేంద్రంలో జరిగిన అండర్–19 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: జూనియర్ కళాశాలల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల సందడి నెలకొంది. ఇప్పటికే పాఠశాల స్థాయిలో అండర్–14, 17 విభాగాల ఎస్‌జీఎఫ్ క్రీడల జిల్లా, ఉమ్మడి జిల్లా ఎంపికలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాస్థాయిలో అండర్–19 ఎస్‌జీఎఫ్ క్రీడల సెలక్షన్స్ ఈనెల 22 నుంచి జరగనున్నాయి. మొదటగా ఉమ్మడి జిల్లా కబడ్డీ బాలబాలికల ఎంపికలను మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో నిర్వహించనున్నారు. త్వరలో వాలీబాల్, ఫుట్‌బాల్, తైక్వాండో, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల సెలక్షన్స్ నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలు..

అండర్–19 విభాగంలో ఉమ్మడి జిల్లాకు ఒక జాతీయస్థాయి, ఏడు రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీలను కేటాయించారు. ఇక్కడ అండర్–19 బాలుర విభాగం జాతీయస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన ఏడు రాష్ట్రస్థాయి టోర్నీల్లో ఇటీవల నారాయణపేట జిల్లా ధన్వాడలో అండర్–19 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ టోర్నీ నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో అండర్–19 బాలుర క్రికెట్, అండర్–19 బాలుర, బాలికల విభాగం హ్యాండ్‌బాల్, అండర్–19 బాస్కెట్‌బాల్ బాలబాలికల నిర్వహించనున్నారు. నారాయణపేట జిల్లాలో అండర్–19 బాలబాలికల వాలీబాల్ రాష్ట్రస్థాయి టోర్నీ, నాగర్‌కర్నూల్ జిల్లాలో అండర్–19 బాలబాలికలకు మల్కం రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అడ్డాకుల మండలం రాచాలలో వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు అండర్–19 బాలుర విభాగం కబడ్డీ టోర్నీ జరగనుంది.

క్రీడల నిర్వహణకు ఇబ్బందులు..

అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా క్రీడల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 66 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఒకే ఫిజికల్ డైరెక్టర్ ఉన్నారు. అండర్–19 క్రీడల సెలక్షన్స్ నిర్వహణ భారం ఆ పీడీపైనే పడుతోంది. దీంతో ఉమ్మడి జిల్లా సెలక్షన్స్, రాష్ట్రస్థాయి టోర్నీల నిర్వహణకు పాఠశాలస్థాయి పీఈటీ, పీడీల సహకారంతో నెట్టుకొస్తున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం..



ఉమ్మడి జిల్లాకు కేటాయించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీలతో పాటు జాతీయస్థాయి టోర్నీని వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అండర్–19 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించాం. ఇతర టోర్నీల తేదీల ఆధారంగా త్వరలో ఉమ్మడి జిల్లాల సెలక్షన్స్ నిర్వహిస్తాం.

– పాపిరెడ్డి, అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

కల్యాణం.. కమనీయం


అలంకరణలో స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతినెల పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణ మహోత్సవం జరపడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం కార్యక్రమం నిర్వహించి.. కల్యాణ తంతు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనావళి తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్ఛరణాలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపారు. కల్యాణం అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకీలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. వివిధ రకాల పూలు, ఆభరణాల అలంకరణలో స్వామి దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఆళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు పాల్గొన్నారు.


మంగళసూత్రాన్ని చూపిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

సీతాఫల్ యూనిట్‌ను సందర్శించిన వీసీ


సీతాఫల్ యూనిట్ వద్ద వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నవాబుపేట: మండలంలోని పోమాల్‌లో రైతు అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సీతాఫల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. సీజనల్ ఫలాలపై కొనసాగుతున్న కార్యక్రమాల్లో సీతాఫల్ యూనిట్ ప్రత్యేకమని.. దీని ఫలితాల ఆధారంగా ఇతర ఫలాల ప్రాసెసింగ్ ఎలా ఉంటుందనేది పరిశీలన జరుగుతుందని వివరించారు. సేకరించిన గుజ్జును రంగు మారకుండా భద్రపర్చి ఎగుమతి చేయడంపై పరిశీలన కొనసాగుతుందని చెప్పారు. అలాగే విశ్వవిద్యాలయం ద్వారా సీతాఫల్ మొక్కల పెంపకం, ప్రత్యేకతలపై సైతం ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఉద్యానశాఖ ద్వారా వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేయడం, రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. రాజశేఖర్, సైదయ్య, పాలమూరు రైతు అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రాములు, బీకేఎస్ కార్యదర్శి గజేందర్, ఆంజనేయులు, రఘునందన్‌రెడ్డి, రామచంద్రయ్య, వెంకటేశ్వరప్ప తదితరులు ఉన్నారు.

శిశువు మృతిపై డీఎంహెచ్ఓ విచారణ



జడ్చర్ల టౌన్: జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం నవజాత శిశువు మృతిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పద్మ గురువారం విచారించారు. ఆస్పత్రిని సందర్శించిన ఆమె బాధిత మహిళ కీర్తి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రసవం చేసిన సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. మృతికి గల కారణాలను విచారించి వెళ్లారు. ఆమెతో పాటు ఆర్ఎంఓ డా.హరినాథ్, ఇతర వైద్యులు ఉన్నారు. ఆస్పత్రికి సాధారణ పరిశీలనకు వచ్చినట్లు డీఎంఅండ్‌హెచ్ఓ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానవపాడు: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. గురువారం మండలంలోని జల్లాపురం, పెద్దపోతులపాడులో స్థానికుల నుంచి 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి ఆటోలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. జల్లాపురం గ్రామంలో ఎరుకలి రవి వద్ద 16 క్వింటాళ్లు, పెద్దపోతులపాడులో ఖాసీం వద్ద 7 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న విజయ్, వెంకట్రాములు, శివ, కృష్ణయ్యతో పాటు ఆటో డ్రైవర్ సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లైంగికదాడికి యత్నం: నిందితుడికి రిమాండు

బిజినేపల్లి: వివాహితపై లైంగికదాడికి పాల్పడిన తిరుపతి అలియాస్ తిరుపాల్‌ను అరెస్టు చేసి 14రోజుల పాటు రిమాండు విధించినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలానికి చెందిన వివాహిత మెడలో బంగారు పుస్తెలతాడును అపహరించడమే కాకుండా, ఆమెతో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఈ నెల 9న బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదైంది. అనంతరం విచారణ చేపట్టిన పోలీస్‌లు తిరుపాల్‌ను బుధవారం అరెస్టు చేసి, గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో హాజరు పరిచినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పాలమూరు యువకుడి సాహసం

- సైకిల్‌పై 12 జ్యోతిర్లింగాల దర్శనానికి శ్రీకారం


సైకిల్ యాత్రికుడు మల్లేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సీమ నరేందర్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం బోయపల్లి 16వ వార్డుకు చెందిన మల్లేష్‌గౌడ్ దేశంలో జ్యోతిర్లింగాల దర్శనం చేసుకోవడానికి సైకిల్‌పై యాత్ర చేయడానికి శ్రీకారం చుట్టాడు. ఏడాది పాటు దేశంలోని 12 జ్యోతిర్లింగ క్షేత్రాలను సైకిల్‌పై వెళ్లి దర్శనం చేసుకోవడం కోసం గురువారం బయలుదేరాడు. మొదట పాలమూరు నుంచి తాండూర్ రూట్లో తన యాత్రను కొనసాగించనున్నాడు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో వార్డు ప్రజలతో పాటు అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు సీమనరేందర్ యువకుడిని శాలువాతో ఘనంగా సన్మానం చేసి అభినందించారు. జ్యోతిర్లింగ క్షేత్రాల దర్శనం కోసం సైకిల్‌పై బయలుదేరడం ఎంతో సాహసమని, యువకుడి యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు సత్యం, జ్ఞానేశ్వర్, యాదయ్య, బాలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమే గెలుపునకు నాంది


మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ ప్రత్యేక అధికారి తఫ్సీర్ ఎక్బాల్


- మైనార్టీ సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఎక్బాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఓటమే గెలుపునకు నాంది అని.. ఎందుకు ఓడిపోయామో గుర్తిస్తే గెలుపు సాధ్యమవుతుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ కార్యదర్శి తఫ్సీర్ ఎక్బాల్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని క్రౌన్ గార్డెన్స్‌లో మిల్లి మహజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత విద్యాసదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనలోని బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించి ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో 200కుపైగా మైనార్టీ గురుకులాల్లో లక్షకుపైగా విద్యార్థులు చదువుతున్నారని.. ఈ ఏడాది 31 మంది విద్యార్థులు ఉచిత వైద్య సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మన పిల్లలకు విద్య అనే ఆయుధాన్ని అందిద్దామని కోరారు. గతంలో జిల్లావాసులు వలసలు వెళ్లి పనులు చేస్తూ జీవనం సాగించేవారని.. సమాజం మారింది, మనం కూడా మారాల్సిన అవసరం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, కార్పొరేషన్ ద్వారా విద్యాభివృద్ధి పథకాలు అమలు చేస్తామని చెప్పారు. సదస్సులో కరీం ఇర్ఫాన్ (కువైట్), హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ అకాడమీ అధ్యక్షుడు మహ్మద్ సయీదుద్దీన్, డా. అబ్దుల్ ఖదీర్ (కర్ణాటక) తదితరులు మాట్లాడారు.

ఆకట్టుకున్న సమీర్ సిద్ధిఖీ ప్రసంగం..

సదస్సుకు ముఖ్యవక్తగా హాజరైన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, న్యూఢిల్లీకి చెందిన సమీర్ అహ్మద్ సిద్ధిఖీ ప్రసంగం ఎంతగానో ఆకట్టుకుంది. సుమారు గంటన్నర పాటు విద్యార్థులు, యువతకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆలోచనాత్మకంగా చదవాలని, ఆత్మ విశ్వాసం కోల్పోకుండా పట్టుదల, ధైర్యంగా ఉంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు మహ్మద్ జహీరుద్దీన్, డా. రఫీక్, డా. లతీఫ్ అతీర్, మిల్లి మహజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్లు తఖీ హుస్సేన్, ఖుద్దూస్‌బేగ్, హఫీజ్ ఇద్రీస్, సలీం నవాబ్, గౌస్ మొహియొద్దీన్, అబ్దుల్ హాదీ, న్యాయవాది జాకీర్, జహీర్ అఖ్తర్, అబ్దుల్లా సున్నీ తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి


ఎగువ జెన్‌కోలోని పవర్ హౌజ్ కేంద్రం

ఆత్మకూర్/ ధరూరు/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిర్విరామంగా కొనసాగుతుంది. గురువారం ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, దిగువలోని 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. మొత్తం 11 కేంద్రాల్లో ఇప్పటి వరకు 534.579 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వివరించారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు గురువారం రాత్రి 8 గంటల వరకు 51 వేల క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో 3 క్రస్టు గేట్లు ఎత్తి 21,528 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు వదలగా.. మరో 47 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.316 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 7 క్రస్టు గేట్లను ఎత్తి 34,420 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలానికి 81,491 కూసెక్కులు..

జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 21,528 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 38,408, సుంకేసుల నుంచి 21,555 కలిపి మొత్తం 81,491 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,900 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,876 మొత్తం 67,776 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 4,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,449, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 884.5 అడుగుల వద్ద 212.9198 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

5 గేట్ల ద్వారా నీటి విడుదల..

రాజోళి: సుంకేసుల డ్యాంలో 5 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. గురువారం ఎగువ నుంచి 24,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. గేట్ల ద్వారా 21,555 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఇద్దరికి గాయాలు

అమ్రాబాద్: పిడుగుపాటుతో ఇద్దరు గాయపడిన ఘటన గురువారం మండలంలోని వంగురోనిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని లక్ష్మాపూర్‌తండా(బీకే)కు చెందిన మధుకుమార్, కృష్ణ బైక్‌పై అమ్రాబాద్ నుంచి తండాకు బయలుదేరారు. మార్గమధ్యంలో వంగురోనిపల్లి స్టేజీ వద్దకు చేరుకోగానే ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వాహనం నిలిపి చెట్టు కింద నిలబడ్డారు. అదే సమయంలో సమీపంలో పిడుగు పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కృష్ణకు స్వల్ప గాయాలుకాగా.. మధుకుమార్ శరీర భాగాలు కాలడంతో అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సమాంతర కాల్వ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మండలంలోని మేడేపల్లి గ్రామ శివారులోని రామన్‌పాడ్ రిజర్వాయర్ పక్కన సమాంతర కాల్వ బ్రిడ్జి వద్ద మృతదేహం ఉందని కార్యదర్శి శిరీష సమాచారం అందించి, ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉంటాడని, ఆకుపచ్చరంగు టీషర్టు, ఆకుపచ్చ పూల అడ్డపంచె, కుడిచేతికి పసుపురంగు దారం ఉందని తెలిపారు. ఆనవాళ్లు గుర్తు పట్టిన వారు పోలీసులకు 8712670631 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

కదుకుంట్లలో మహిళ..


కదిరే సావిత్రి (ఫైల్)

వనపర్తి రూరల్: మండలంలోని కదుకుంట్ల గ్రామ శివారులోని భీమా ఫేస్–2 ప్రధాన కాల్వలో మహిళ మృతదేహం లభ్యమైనట్లు వనపర్తి రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని కదుకుంట్ల గ్రామానికి చెందిన కదిరే సావిత్రి(32) వృత్తి గొర్రెల కాపరి. ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఆమె బుధవారం సాయంత్రం భీమా ఫేస్–2 ప్రధాన కాల్వలో నీళ్లు తీసుకురావడానికి వెళ్లి ప్రమాదవశాతు కాల్వలో పడి కొట్టుకుపోయింది. గురువారం మధ్యాహ్నం శ్రీ రంగాపురం మండలంలోని తాటిపాముల శివారులో భీమా ఫేస్–2 కాల్వలో ఆమె మృతదేహం లభ్యంమైంది. మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి కొత్తల రాములు గురువారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాలధారలా జాలువారుతూ..!




బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన దోరణి వల్ల కురుస్తున్న వర్షాలకు నల్లమలలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఉమామహేశ్వరం కొండ చరియల నుంచి జలపాతం పాలధారలా జాలువారుతూ పర్యాటకులు, భక్తులను కనువిందు చేశాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల కొండ చరియల నుంచి పారుతున్న జలపాతాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

– అచ్చంపేట